సాక్షి ఒడిశా
సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025



శ్రీ మందిరం ఆదాయం

నగదు	రూ. 11,14,548
బంగారం	4 గ్రాముల 450 మిల్లీ గ్రాములు
వెండి	96 గ్రాముల 400 మిల్లీ గ్రాములు

భువనేశ్వర్/పూరీ



భారీ అగ్ని ప్రమాదం

అట్టల ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు అంటుకున్నాయి. - 8లో



వెలగని ఫ్లడ్‌లైట్లు

ఇండియా, ఇంగ్లండ్ వన్ డే మ్యాచ్ మధ్యలో ఫ్లడ్‌లైట్లు ఆగిపోయాయి. కాసేపటి తర్వాత బాగు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

రాయగడ-ధమన్‌జోడి రైల్‌లైన్ పరిశీలన



రాయగడ -ధమన్‌జోడి మార్గంలొ గల టన్నల్‌లో పర్యటిస్తున్న డీఆర్‌ఎం సింఘాల్

రాయగడ: రాయగడ రైల్వే డివిజనల్ మేనేజరు అమితాభ్ సింఘాల్ ఆదివారం కొరాపుట్ రాయగడ రైలు మార్గంలో గల రాయగడ-ధమన్‌జోడి సెక్షన్‌లోని పలు పనులను పరిశీలించారు. ఈ మార్గంలో గల కెవుటిగుడ, సికరపాయి ప్రాంతాల్లో ఉన్న వంతెనలను పరిశీలించారు. టన్నెల్ 32లో ప్రత్యేకంగా పరిశీలించిన ఆయన అక్కడ లైనింగ్ బలోపేతం, ప్రస్తుత పరిస్థితిపై అధికారులతో చర్చించారు. ఎల్లవేళలా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం సపింగార్ లైన్‌లో జరుగుతున్న డబ్లింగ్ పనులను పరిశీలించారు. అనంతరం పైలెట్లు ,అసిస్టెంట్ లోకో పైలట్స్, ట్రైన్ మేనేజర్లతో ప్రత్యేకంగా సమీక్షించిన ఆయన తీసుకోవాల్సిన సేఫ్టీ పనుల గురించి చర్చించారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



గాయపడిన విద్యార్థి రామ చంద్రకు ఆర్థిక సహాయంగా చెక్కు అందజేస్తున్న యూనివర్సిటీ అధికార బృందం

జయపురం: దుండగుల దాడిలో గాయపడిన స్థానిక విక్రమ్‌దేవ్ యూనివర్సిటీ విద్యార్థికి యువ రెడ్‌క్రాస్ ఆర్థిక సాయం అందజేసింది. ఈ సహాయాన్ని వర్సిటీ పీజీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత కుమార్ పాత్రో ఆదివారం అందజేశారు. డాక్టర్ పాత్రోతో పాటు వర్సిటీ భూగోళ విభాగ చీఫ్ మళయ కుమార్ దాస్, యువ రెడ్‌క్రాస్ అధ్యక్షుడు డాక్టర్ రక్షభ కుమార్ సాహులు క్షతగాత్ర విద్యార్థి రామ చంద్ర మాడి చికిత్స పొందుతున్న కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్యకళాశాల హాస్పిటల్‌కు వెళ్లారు. వారు చికిత్స పొందుతున్న రామచంద్రతో అతడి ఆరోగ్య స్థితిపై విచారించారు. అనంతరం వారు విద్యార్థికి పది వేల రూపాయల చెక్కును ఆర్థిక సాయంగా అందజేశారు. ప్రశాంతకుమార్ పాత్రో పత్రికలవారితో మాట్లాడుతూ రామచంద్ర కడుపులో తీవ్ర గాయమైందని ఆపరేషన్ తర్వాత అతడి ఆరోగ్య పరిస్థితి మెరుగైందని వెల్లడించారు. జయపురం విక్రమ క్రీడా మైదానం వద్ద సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

గీతాజ్ఞానంపై క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో విద్యార్థులు

పర్లాకిమిడి: స్థానిక సరస్వతీ శిశు విద్యామందిర్‌లో గీతాజ్ఞానంపై క్విజ్ పోటీలను ఆదివారం నిర్వహించారు. సుమారు 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజ్ఞాణ్ మిషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఏటా గీతా జ్ఞానంపై ఒడిశాలో ఒక్కోచోట విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తూ ప్రచారం చేస్తున్నట్టు జిల్లా కోఆర్డినేటర్ గురుచరణ్ శోబోరో, బ్లాక్ కోఆర్డినేటరు డంబురో ధర్ బిశ్వాళ్ తెలియజేశారు. కార్యక్రమంలో శిశుమందిర్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సరోజ్‌కుమార్ పండా, గోపాలకృష్ణ పండిట్, హరిమణి మండళ్, సుభద్రా గోమాంగో పర్యవేక్షించారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



తాడింగి మృతదేహం

రాయగడ: విద్యుత్ విభాగంలొ హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి కరెంటు షాక్‌తో ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు సదరు సమితి పరిధి శెశిఖాల్ పంచాయతీలొని బైరాగిహాలువ గ్రామానికి చెందిన డాలయ్య తాడింగి (30)గా గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. పిప్పలగుడ సబ్‌గ్రిడ్ పరిధిలోని మిరావలి వద్ద స్తంభంపై మరమ్మతులు చేస్తున్న సమయంలో షాక్ తగలడంతో కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసంతరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఐదేళ్లగా విద్యుత్ శాఖలో పనిచేస్తున్న తాడింగి కుటుంబాన్ని సంబంధిత శాఖ ఆదుకోవాలని గ్రామస్తులు, కుటుంబీకులు కోరుతున్నారు.

గేమ్ చేంజర్



నిరంతర సాధన



క్రీడాకారులకు ప్రాక్టీస్ చేయిస్తున్న క్రాంతి

- క్రీడాకారులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్న ట్రైస్పోర్ట్స్ సంస్థ
- వ్యాయామం నుంచి శిక్షణ వరకు అన్నీ ఉచితమే



ప్రాక్టీస్ చేస్తున్న యువతులు



శిక్షణ ఇస్తున్న దృశ్యం



శిక్షణ పొందుతున్న యువకులు

రాయగడ: క్రీడల్లో ఆసక్తి ఉండి ఆర్థిక స్థోమత లేక వెనుకబడిపోతున్న ప్రతిభావంతులకు ట్రై స్పోర్ట్స్ సంస్థ వెన్నుదన్నుగా నిలుస్తోంది. వ్యాయామం నుంచి శిక్షణ వరకు అన్ని దశల్లోనూ ఉచితంగా సేవలు అందిస్తూ అండగా నిలుస్తోంది. 2011 సంవత్సరంలో ఏర్పాటైన ఈ సంస్థ ఉచితంగా వ్యాయామం, క్రీడల్లో శిక్షణ ఇస్తూ ఎదుగుతోంది. ప్రస్తుతం దాదాపు 60 మంది వరకు యువతీ,యువకులకు ఈ సంస్థ ఉచితంగా శిక్షణను అందిస్తోంది. స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రతి రోజూ ఉదయం 5 గంటల నుంచి ఏడు గంటల వరకు, అదేవిధంగా సాయంత్రం 6 నుంచి ఏడు గంటల వరకు ఉచితంగా శిక్షణను ఇస్తున్నారు. 2011లో స్థానిక యువకుడు సొండి క్రాంతి, రాజేష్ పట్నాయక్‌లు ఈ సంస్థను ఏర్పాటు చేశారు. యువతీ, యువకులకు క్రీడలపై అవగాహన కల్పిస్తుండేవారు. గత దశాబ్దకాలంలొ దాదాపు వంద మందికి పైగా క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో రాణించారు. పలువురు స్పోర్ట్స్ కోటాలో కూడా ఉపాధి అవకాశాలు పొంది వారి భవిష్యత్‌ను ఉజ్వలంగా మార్చుకున్నారు.

క్రీడలపై అవగాహన

క్రీడా రంగంలో ఆసక్తి కనబరచాలంటే అందుకు అవగాహన కలిగి ఉండాలన్న ఉద్దేశంతో సంస్థ ప్రతి వారంలో రెండు రోజులు క్రీడలకు సంబంధించిన వీడియో షోలను ఏర్పాటు చేస్తోంది. ఈ షోల వల్ల అవగాహన పెరగడంతో పాటు ఉత్సాహం కూడా కలుగుతుందని వ్యవస్థాపకుడు సొండి క్రాంతి చెప్పారు. అదేవిధంగా ప్రతి వారంలో రెండు రోజులు హిల్ ట్రైనింగ్ ఇస్తున్నారు.

ప్రోత్సహించేందుకే..



క్రీడల్లో ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహించేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేశాం. హోంగార్డుగా పనిచేస్తూ మిగతా సమయాల్లో నేను ఆటో నడుపుతుంటాను. జిల్లాలో ఎందరో క్రీడాకారులు ప్రోత్సాహం లేక వెనుకబడిపోతున్నారు. వారిలో స్ఫూర్తి రగిలించేందుకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం.

– సొండి క్రాంతి, ట్రై స్పోర్ట్స్ వ్యవస్థాపకులు

సాధన అవసరం..



క్రీడల్లో రాణించాలంటే అందుకు సాధన అవసరం . అయితే సరైన శిక్షణ లేకపోతే వారు ఆయా రంగాల్లో రాణించడం కష్టతరం. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సంస్థను ఏర్పాటు చేశాం. ఉత్సాహవంతులైన యువతీ, యువకులు కూడా శిక్షణ పొందేందుకు వస్తున్నారు.

– రాజేష్ పట్నాయక్, శిక్షణ సంస్థ సహాయకులు

డబ్బులు తీసుకోవడం లేదు



క్రీడల్లో రాణించాలని ఆసక్తి ఉన్నా అందుకు తగిన శిక్షణ కరువవ్వడంతో ఆయా రంగాల్లో రాణించలేకపోతున్నాం. ఈ సంస్థ ఏర్పాటైన తర్వాత అందులో చేరాను. ఎన్నో మెలకువలు తెలుసుకున్నాను. ఎలాంటి రుసుం తీసుకోలేదు.

– క్రిష్ణ హరిజన్, క్రీడాకారుడు

బకాయి వేతనాలు చెల్లించాలని వినతి



సేవా కార్మిక యూనియన్ సమావేశంలో ప్రమోద్ మహంతి తదితర నేతలు

జయపురం: జయపురం గగణాపూర్‌లోగల సేవా పేపరు మిల్లు కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఎఐటియుసి) అనుబంధ సేవా కార్మిక యూనియన్ విజ్ఞప్తి చేసింది. ఆదివారం స్థానిక కార్మిక భవనంలో కార్మిక నేత ప్రమోద కుమార్ మహంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్మిక కుటుంబాలు పడుతున్న ఇబ్బందులపై చర్చించారు. ఏడు నెలలుగా కార్మికులకు జీతాలు అందలేదని తెలిపారు. కనీసం రెండు విడతలుగానైనా జీతం ఇవ్వాలని మిల్లు యాజమాన్యానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు ప్రమోద కుమార్ మహంతి వెల్లడించారు. అలాగే మిల్లు యాజమాన్య పరివర్తన కోసం చేసిన బిజినెస్ ట్రాన్స్‌ఫర్‌మెంట్ అగ్రిమెంట్ అందరి ఆమోదం పొందేందుకు అందరి ముందు బహిరంగ చర్చ జరగాలని డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. పీఎఫ్ సమస్య కూడా పరిష్కరించాలన్నారు. స్థానిక లేబర్ కమిషనర్ మూడు పర్యాయాలు బిజినెస్ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంట్‌పై చర్చించేందుకు సమైక్య సమావేశానికి పిలిచినా యాజమాన్యం రాలేదని సమావేశం విమర్శించిందని వెల్లడించారు. 2020 ఫిబ్రవరి 26న చేసిన బిజినెస్ ట్రాన్స్‌ఫర్‌మెంట్ అగ్రిమెంట్ లేబర్ కోర్టు ఆమోదం పొందినట్లు యాజమాన్యం చెబుతూ మోసగిస్తోందన్నారు. అందుకే లేబర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టేందుకు సమావేశం తీర్మానించిందని వెల్లడించారు. సమావేశంలో కె.సత్యనారాయణ, అలేక్ పాత్రో, బసంత పాత్రో, రవీంద్ర రౌత్ తదితరులు పాల్గొన్నారు.

బిసంకటక్‌లో నిధి రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న పట్నాయక్ తదితరులు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్‌లో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మలేరియా, డెంగీ వ్యాధుల నివారణ చర్యల్లో భాగంగా నిధి రథం పేరిట ప్రచార రథం ఆదివారం ప్రారంభమయ్యింది. సమితి ఉపాధ్యక్షులు దేవి ప్రసాద్ పట్నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై రథాన్ని ప్రారంభించారు. డెంగీ, మలేరియా వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలకు సంబంధించి అవగాహన కల్పించేందుకు ఈ రథాన్ని ప్రారంభించినట్లు పట్నాయక్ తెలియజేశారు. ముఖ్యంగా డెంగీ, మలేరియా వ్యాధులను నివారించాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నిద్రించే సమయంలో దోమతెరలను తప్పకుండా వినియోగించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారిలో అవగాహన లేకపోవడంతో వారు వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య, వైద్యశాఖ తీసుకుంటున్న ఈ ప్రచార, చైతన్య కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలొ డాక్టర్ సుమిత నాయక్, డాక్టర్ జీవన్ జ్యోతి బెహర, జ్యోత్స్న మహరణ తదితరులు పాల్గొన్నారు. సమితిలో గల అన్ని పంచాయతీల్లో ఈ ప్రచార రథం ఈ నెల 20 వ తేదీ వరకు తిరుగుతుందని డాక్టర్ జీవన్ జ్యోతి బెహర తెలియజేశారు.

న్యాయవాదులకు వర్క్‌షాప్



వర్క్‌షాపులో పాల్గొన్న న్యాయవాదులు



కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సీఎస్ఎన్ఆర్ అధికారులు

జయపురం: న్యాయవాదులకు సంబంధిత న్యాయపరమైన వర్క్ షాపును హైకోర్టు విశ్రాంత విచారపతి సచ్చిదానంద సాహు ఆదివారం ప్రారంభించారు. కొరాపుట్ సామాజిక సంస్థ సి.ఎస్.ఎన్.ఆర్ (సెంటర్ ఫర్ ది సెస్టైనబుల్ యూజ్ ఆఫ్, నేచురల్ అండ్ షోషియల్ రిసోర్సెస్) నిర్వహిస్తున్నది. జయపూర్ సభా గృహంలో ప్రారంభమైన ఈ వర్క్‌షాపునకు సి.ఎస్.ఎన్.ఆర్ ప్రాజెక్టు అధికారి చంద్ర నాథ్ జాని అధ్యక్షత వహించారు. సమాజంలో సాధారణ ప్రజలకు సులభంగా న్యాయం ఎలా లభిస్తుందో తెలుసుకొని వారికి న్యాయం జరిగేటట్టు చూడాలన్నారు. న్యాయవాదులు తమ కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

ఏసీ బస్సులో నల్లుల బెడద!

- దారిలో దిగిపోయిన ప్రయాణికులు



బస్సు కిటికీలు పాడవ్వడంతో ప్లాస్టర్‌ను కప్పిన దృశ్యం

మల్కన్‌గిరి: ఒడిశా ఆర్టీసీ ఏసీ బస్సులో ప్రయాణించిన వారికి వింతఅనుభూతి ఎదురైంది. నల్లులు విపరీతంగా కుట్టడంతో భరించలేక మార్గ మధ్యలో దిగిపోయారు. కటక్ నుంచి చిత్రకొండకు రోజూ ఒడిశా ఆర్టీసీకి చెందిన ఏసీ బస్సు రాకపోకలు సాగిస్తుంటాది. సుమారు ఏడు వందల కిలోమీటర్ల దూరం కావడంతో చాలామంది ఈ బస్సును ఆశ్రయిస్తారు. అయితే ఆదివారం ఉదయం బయలుదేరిన బస్సులో నల్లులు బెడద ఎక్కువైంది. దీంతో బలిమెలలోనే బస్సును నిలిపివేయించిన ప్రయాణికులు మార్గమధ్యలో దిగిపోయి వేరే బస్సును ఆశ్రయించారు. నల్లుల సమస్యను అనేకసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదని, అలాగే కిటికీ అద్దాలు పగిలిపోయాయని ప్రయాణికులు చెబుతున్నారు. బస్సును మరమ్మతుల కోసం కొద్దిరోజులు కటక్ పంపిస్తామని ఆర్టీసీ అధికారి హృషికేశ్‌దాస్ తెలిపారు.

ఉత్సాహంగా ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



వంటలను రుచి చూస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక సెక్రెడ్ హార్ట్ స్కూల్‌లో శనివారం సాయంత్రం విద్యార్థుల మధ్య ఫుడ్ ఫెస్టివల్‌ని నిర్వహించారు. ఇందులో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. వివిధ రకాల వంటలను వారు స్కూల్ ప్రాంగణంలొ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ప్రదర్శించారు. తొలిసారిగా స్కూల్‌లో ఈ తరహా కార్యక్రమం నిర్వహించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ప్రదర్శనలో 44 ఫుడ్ స్టాల్స్ ఏర్పాటయ్యాయి. ఉపాధ్యాయుడు సంతోష్ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.

గజపతి జిల్లాలో న్యాయ చట్టాలపై వర్క్‌షాప్



కిశోర్ న్యాయ చట్టాలు, హక్కులపై మాట్లాడుతున్న న్యాయ సలహాదారు మనోజ్ కుమార్ త్రిపాఠి



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఎస్పీ జితేంద్ర కుమార్ పండా

పర్లాకిమిడి: గజపతి కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కిశోర్ న్యాయ చట్టాలు, హక్కులు, పోలీసుల భూమికపై ఒక రోజు వర్క్‌షాప్‌ను గజపతి ఎస్పీ జితేంద్ర కుమార పండా అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్, జిల్లాలో పది పోలీసు స్టేషన్ల నుంచి ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఆరు స్టేషన్ల నుంచి బాలనేర పీఎస్‌ల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో బాలలను గంజాయి, దోపిడీ, పిక్ పాకెటింగ్ వంటి నేరాలకు కొందరు వినియోగిస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ జితేంద్ర కుమార్‌పండా ఆదేశించారు. బాలలు, మైనర్ బాలికలపై చట్టాలు, వారి హక్కులు ఆచరణలోకి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా లీగల్ రిసోర్స్ పర్సన్ మనోజ్ కుమార్ త్రిపాఠి బాలల చట్టాలు, హక్కులు, సెక్షన్లపై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ యూనిట్ చైర్మన్ అశ్వినీ కుమార్ మహాపాత్రో, డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠి, వన్ స్టాప్ సెంటర్ అధికారిని సునీతా రోథో, అరుణ సంస్థ జిల్లా కోర్డినేటరు సాయిప్రసాద్, చైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా చట్ట పర్యవేక్షణ అధికారి జయప్రకాష్ బడిత్యా సభకు ధన్యవాదాలు తెలిపారు.

మౌసిమా మందిరంలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన



మౌసీమా మందిరం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు



నూతన మందిరంలో ప్రతిష్ఠాపనకు సిద్ధంగా ఉన్న నవగ్రహ విగ్రహాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో ఉన్న మౌసీమా మందిరంలో ఆదివారం నవగ్రహ విగ్రహాలు ప్రతిష్ఠించారు. ముందుగా జిల్లా బ్రాహ్మణ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ పురాతన మందిరం స్థానిక దుర్గ గుడి వీధిలో ఉన్న మందిరంలో పూజలు చేశారు. ముందుగా 100 కలశాలతో పవిత్ర జలాలు సేకరించారు.

న్యూస్‌రీల్

కింగ్‌కోబ్రా కలకలం



మరుగుదొడ్డిలో కింగ్ కోబ్రా

కాశీబుగ్గ: మందస మండలం చిన్నకోష్ట గ్రామంలో శనివారం రాత్రి కింగ్ కోబ్రా కలకలం రేపింది. గ్రామానికి చెందిన రాయిక భరత్ అనే వ్యక్తి ఇంటిలోని స్నానాల గదిలో సుమారు పది అడుగులు ఉన్న కింగ్ కోబ్రా ప్రత్యక్షమైంది. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానిక అటవీ ప్రాంతం నుంచి ఇంటిలోకి కింగ్ కోబ్రా చొరబడి ఉండవచ్చని భావిస్తున్నారు. భయాందోళనకు గురైన స్థానికులు సమాచారాన్ని అటవీశాఖ అధికారులకు అందజేశారు.

జయహో.. రాజమ్మ తల్లి



రాజమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

గార: మండలంలోని చిన వత్సవలసలో కొలువున్న రాజమ్మ తల్లి (రాజరాజేశ్వరి) దర్శనానికి తొలి వారం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. శనివారం రాత్రికి వచ్చిన భక్తులు సమీప తోటల్లోనూ, ఆరుబయట బసచేసి రాజరాజేశ్వరి (రాజమ్మ తల్లి) పాటు భూలోకమ్మ తల్లికి ఆదివారం ఉదయం వరకు మొక్కులు తీర్చుకున్నారు. వేకువ జామున సమీపంలోని సముద్రంలో స్నానాలాచరించారు. కుటుంబ సమేతంగా విచ్చేసి ఇక్కడే వంటలు చేసుకొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆది పీఠంలో ఒకటైన మైలపిల్లి శ్రీనివాసదాసుడు ఇంట్లో సంబరాలు జరగ్గా, మరి కొన్ని ఆదిపీఠాలైన పేరయ్య, జయమ్మ తదితర దాసుళ్ల ఇంటి వద్ద సంబరం జరిగింది. తొలివారం జాతరకు శ్రీకాకుళం పట్టణ సీఐ పైడపునాయుడు, ఎస్ఐ ఆర్.జనార్ధన్ ఆధ్వర్యంలో 90 మంది పోలీసులు విధుల్లో పాల్గొన్నారు.

కళలు చరిత్రకు సాక్ష్యాలు



మాట్లాడుతున్న మంత్రి రామ్మోహన్‌నాయుడు

ఆమదాలవలస : కళలు చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తాయని కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. పట్టణంలోని పాలపోలమ్మ ఆలయం ఆవరణలో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీల్లో భాగంగా 3వ రోజు ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమదాలవలస రంగస్థల కళాకారుల సంఘ అధ్యక్ష కార్యదర్శులు తమ్మినేని విద్యాసాగర్, పేడాడ ప్రతాప్ కుమార్‌లను ఆయన అభినందించారు. స్థానిక ఎమ్మెల్యే కూనరవికుమార్ కూడా మాట్లాడారు. కళాప్రాంగణం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాకారులను సత్కరించారు. అనంతరం ఏపీ, తెలంగాణకు చెందిన మూడు నాటికలను ప్రదర్శించారు.

కుంభమేళాకు 16న మరో స్పెషల్ బస్సు

శ్రీకాకుళం అర్బన్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగలో జరుగుతున్న కుంభమేళాకు వేసిన బస్సు సర్వీసులకు అనూహ్య స్పందన వస్తోందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ తెలిపారు. శ్రీకాకుళం నుంచి మహా కుంభమేళాలో పుణ్య స్నానాలకు (ప్రయాగరాజ్) వెళ్లే వారి కోసం ఆర్టీసీ శ్రీకాకుళం 1వ డిపో అధికారులు ఈ నెల 8వ తేదీన ఏర్పాటు చేసిన స్పెషల్ సూపర్ లగ్జరీ (2+2) పుష్ బ్యాక్ బస్సుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ స్పందన మేరకు కుంభమేళ యాత్రా స్పెషల్ బస్సును ఈనెల 12వ తేదీన ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులో కూడా ప్రయాణికుల టిక్కెట్ బుకింగ్స్ ఫుల్ అయిపోయినట్లు ఆయన తెలిపారు. 16న మరో ప్రత్యేక సర్వీసును మహా కుంభమేళాకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 16న శ్రీకాకుళం బస్ స్టేషన్ నుంచి రాత్రి 8 గంటలకు బస్సు బయల్దేరుతుందన్నారు. మొత్తం 7 రోజుల్లో మొదటి రోజు రాత్రి శ్రీకాకుళంలో బయల్దేరి రెండో రోజు ఉదయానికి పూరి చేరుకుంటుందని, పూరీలో జగన్నాథ స్వామి వారి దర్శనం, కోణార్క్, సాయంత్రం భువనేశ్వర్‌లో గల లింగరాజ్ ఆలయం దర్శించుకున్న తర్వాత నేరుగా మూడో రోజు సాయంత్రానికి ప్రయాగ్ రాజ్ చేరుకుంటుందని పేర్కొన్నారు. నాల్గో రోజు ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించిన తర్వాత అదే రోజు రాత్రి బయల్దేరి ఐదో రోజు ఉదయానికి వారణాశి చేరుకుంటుందన్నారు. కాశీ విశ్వేశ్వరుడిని దర్శించిన అనంతరం ఆరో రోజు ఉదయం వారణాశి నుంచి బయలుదేరి గయ, బుద్ధ గయ క్షేత్రాల దర్శనానంతరం ఏడో రోజు రాత్రికి శ్రీకాకుళం చేరుకుంటుందని తెలిపారు. ఈ సర్వీస్‌కు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. మనిషి ఒక్కంటికి టికెట్ ధర రూ.9,500 అని తెలిపారు. యాత్రికులకు మధ్యాహ్నం భోజనం – ఉదయం, రాత్రి అల్పాహారం ఏర్పాటు చేస్తామన్నారు. ఇతర ఖర్చులు, వసతి ఖర్చులు యాత్రికులు ఎవరి ఖర్చులు వారే భరించాల్సి ఉంటుందన్నారు.

గుభాళించిన సాహితీ పరిమళాలు..



జయపురం గొప్పదనాన్ని పరిచయం చేస్తున్న విజయకుమార్

- ఉత్సాహంగా సాహితీ సంస్కృతీ సమాజం స్వర్ణోత్సవ వేడుకలు

జయపురం: జయపురం భారతీ సాహితీ సంస్కృతీ సమాజం ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు శనివారం సాయంత్రం స్థానిక తెలుగు సంస్కృతిక సమితి వారి సిటీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో సాహితీ పరిమళాలు గుభాళించాయి. అతిథులు, గాయకులు తెలుగు సాహిత్యం ఉట్టిపడేలా మృధుమధురంగా పాడిన తెలుగు పాటల కమ్మదనాన్ని ప్రేక్షకులు ఆస్వాదించారు.

ఒడిశా ఉద్యానవన విభాగ విశ్రాంత ఉన్నతాధికారి సానా వెంకట రమణ స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన సభలో సినీ రచయిత బల్లా విజయ కుమార్ జయపురం గురించి పరిచయం చేస్తూ కళాకారులు, రచయితలు, సాహితీ సేవకులను గుర్తుచేశారు. జయపురం మహారాజు సాహితీ సామ్రాట్ విక్రమదేవ్ వర్మ సాహితీ రంగానికి ముఖ్యంగా తెలుగు, నాటక, సాహిత్య రంగాలకు కవులకు, నటులకు ఇచ్చిన చేయూత చిరస్మరణీయమన్నారు.



సభావేదికపై ముఖ్యఅతిథులు శశిపట్నాయక్ తదితరులు

జయపురం విక్రమ ఆర్ట్స్, క్రాఫ్ట్ కళాశాల విద్యార్థి గిడుతూరి లక్ష్మీనారాయణ (జి.ఎల్.నారాయణ) ఆధునిక శిల్ప, చిత్ర, లేఖనలో జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి గడించారని గుర్తు చేస్తూ అది జయపురం తెలుగు వారికి గర్వకారణమన్నారు. జయపురం.ఉత్కళాంధ్రులు గర్వించదగ్గ అనేక మంది తెలుగు ప్రముఖులు పలు రంగాలలో ఖ్యాతి సాధించి ఉత్కళాంధ్రుల కీర్తి కిరీటాలుగా వెలుగొందారని వివరిస్తూ జయపురం గత చరిత్రను సభికులకు పరిచయం చేశారు. భారతికి, తెలుగు సాంస్కృతిక సమితికి, సిటీ స్కూలుకు అవినాభావ సంబంధం ఉందన్నారు. రచయిత, అనువాదకులు కిల్లంశెట్టి వెంకట రమణ (కేవీ) అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పి.శశిభూషణ పట్నాయక్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని వడుగూరి సూర్యనారాయణ మూర్తి (డికెన్స్) నిర్వహించారు. డికెన్స్ తన మురళీరవళితో అందించిన శ్రావ్య సంగీతంతో ప్రారంభమైన కార్యక్రమంలో ముందుగా దివంగత భారతీ సభ్యులకు సభికులు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కార్టూనిస్టు మళ్ల జ్యోతిర్మయి పాడిన తెలుగు పాటలు భారతీ స్వర్ణ సంబరాల్లో మరువలేనితీపి గుర్తులుగా నిలిచాయి. భారతీ సభ్యులు జామి వెంకట రావు వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.



తెలుగు, ఒడియా కవితలను పాడిన విజయ కుమార్



హాజరైన తెలుగు రచయితలు, సాహితీవేత్తలు



జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

• బీజేపీ శ్రేణుల సంబరాలు



ఎమ్మెల్యే గౌరీశంకర్ మాఝికి మిఠాయి తినిపిస్తున్న కుంజబిహారి

నవరంగపూర్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించడంతో నవరంగపూర్‌లో ఆ పార్టీ శ్రేణులు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. మా బండారు ఘరణి అమ్మవారి దేవాలయం ఎదుట సంబరాలు నిర్వహించి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నవరంగపూర్ ఎమ్మెల్యే గౌరీశంకర్ మాఝి, జిల్లా అధ్యక్షులు కుంజబిహారి పాల్గొన్నారు.

బారాబటిలో వెలగని ఫ్లడ్‌లైట్లు



బారాబటి స్టేడియంలో వన్డే మ్యాచ్ సమయంలో వెలగని ఫ్లడ్ లైట్లు

భువనేశ్వర్: సుదీర్ఘ కాలం తర్వాత కటక్ బారాబటి స్టేడియంలో జరుగుతున్న భారత్, ఇంగ్లండ్ వన్‌డే మ్యాచ్‌లో అపశృతి చోటు చేసుకుంది. దీంతో స్టేడియం మసకబారింది. మ్యాచ్ ఉత్కంఠభరితంగా కొనసాగుతున్న తరుణంలో ఫ్లడ్ లైట్లు వెలగలేదు. స్టేడియంలో పాక్షికంగా చీకటి కమ్ముకుని మసకబారింది. వీక్షకులు, క్రికెటర్లలో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుంది. అంపైర్లతో సంప్రదింపుల తర్వాత క్రికెటర్లు మ్యాచ్ ప్రాంగణం నుంచి వైదొలిగారు. ఫ్లడ్ లైట్ల పునరుద్ధరణతో తిరిగి రంగంలోకి దిగి ఆట కొనసాగించారు. ఈ నేపథ్యంలో మ్యాచ్ తాత్కాలికంగా వాయిదా పడడంపై సర్వత్రా విచారం వ్యక్తం అయింది.

టాస్ గెలిచిన ఇంగ్లండ్ జట్టు బ్యాటింగ్ చేశాక భారత్ జట్టు బ్యాటింగ్ ఆరంభించింది. ఈ సమయంలో ఫ్లడ్ లైట్ల సమస్య తలెత్తింది. కొన్ని చోట్ల లైట్లు వెలగక పోవడంతో బారాబటి స్టేడియం మసకబారింది. మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో భారత్ జట్టు బ్యాటింగ్ చేస్తుండగా ఈ సంఘటన జరిగింది. 6.1 ఓవరులో భారత్ వికెట్టు నష్టపోకుండా 48 పరుగులు చేసిన సమయంలో ఫ్లడ్ లైట్ల వెలుగులో లోపం కనిపించింది. ముందుగా స్టాండ్లలోని కొన్ని లైట్లు ఆరిపోయాయి. కాసేపటికే మొత్తం స్టాండ్‌లోని లైట్లు ఆరిపోయాయి. అంపైర్‌తో సంప్రదించిన తర్వాత రెండు జట్ల ఆటగాళ్లు పెవిలియన్‌కు తిరిగి వచ్చారు. ఆట ఆగిపోయే సమయానికి రోహిత్ శర్మ 29, శుభ్‌మన్ గిల్ 17 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నారు. ఇటువంటి రసవత్తర ఘడియల్లో స్టేడియం మసకబారడంతో ప్రేక్షకులు, క్రికెటర్లు ఇతర అనుబంధ వర్గాలు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు.

జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ విజేత తామాడ ఏపీ మోడల్ స్కూల్

శ్రీకాకుళం: టాలెంట్ టెస్ట్‌ల వలన విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని టెక్కలి ఉప విద్యాశాఖాధికారి విలియమ్స్ అన్నారు. రాష్ట్ర బయాలజీ టీచర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో గత నెల నాల్గో తేదీ నిర్వహించిన మండలస్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులను ఆయన ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు. నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో 27 మండలాల టీమ్‌లు, 6 ఒడియా టీమ్‌ల ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ విజేత తామాడ ఏపీ మోడల్ స్కూల్ కాగా, ద్వితీయ స్థానం రొంపివలస ఉన్నత పాఠశాల, తృతీయ స్థానం పెద్ద పద్మాపురం పాఠశాల విద్యార్థులు సాధించారు. ఒడియా విభాగంలో తొలి రెండు స్థానాల్లో టెక్కలి, ఈదుపురం పాఠశాలలు నిలవగా బహుమతులను అందించారు. ఉమామహేశ్వరరావు చేసిన మేజిక్ షో, తాడివలస విద్యార్థినులు ప్రదర్శించిన స్కిట్ ఆకట్టుకున్నాయి.

అట్టల ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం



ఫ్యాక్టరీలో మంటలు



అలుముకున్న దట్టమైన పొగ



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాయగడ: సదరు సమితి పరిధిలో గల బాకురుగుడ గ్రామ సమీపంలో ఉన్న సత్యం ప్యాకర్స్ అండ్ మూవర్స్ అనే అట్టల ఫ్యాక్టరీలో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో లక్షలాది రూపాయల ముడి సరుకు, అట్టల తయారీకి వినియోగించే కెమికల్ బస్తాలు కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. మంటలు ఉవ్వెత్తున రావడంతో సమీపంలో గల జేకే పేపర్ మిల్‌కు సంబంధించిన అగ్నిమాపక సిబ్బంది, అలాగే కొలనార అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే మంటలను అదుపు చేసేందుకు సుమారు 8 గంటల సమయం పట్టింది. ఉదయం ఎప్పటిలాగే ఫ్యాక్టరీని తెరిచి పనులు నిర్వహిస్తున్న సమయంలో ఫ్యాక్టరీ బయట ఉన్న అట్టలకు నిప్పు అంటుకుని ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అదే సమయంలో అక్కడే కెమికల్ బస్తాలు ఉండటంతో వాటికి కూడా నిప్పు తగిలి మంటలు చెలరేగాయి. దీంతో ఒక్కసారిగా మంటలు ఊపందుకోవడంతో ఫ్యాక్టరీలో ఉన్న వారు వెంటనే బయటకు వచ్చి తమ ప్రాణాలను కాపాడుకోగలిగారు. దట్టమైన పొగ అల్లుకోవడంతో మంటలను అదుపు చేసేందుకు చాలా సమయం పట్టిందని అగ్నిమాపక అధికారులు తెలియజేశారు. అయితే ఫ్యాక్టరీ యజమాని గోవింద రావు మాత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం సంభవించిందని చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

- ఒకరికి గాయాలు



సంఘటన స్థలం వద్ద బిపిన్ జెన్న మృతదేహం



ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనం

రాయగడ: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలవ్వగా మరొకరు తీవ్రగాయాలకు గురయ్యారు. ఈ ఘటన రాయగడ జిల్లాలోని అంబొదల పోలీస్ స్టేషన్ పరిధి కుంటాబడి గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. మృతుడు కలహండి జిల్లాలోని లంజిఘడ్‌కు చెందిన బిపిన్ జెన్న (28), గాయాలకు గురైన వ్యక్తి బిపిన్ బిహారి సాహులుగా పోలీసులు గుర్తించారు. కలహండి జిల్లా లంజిఘఢ్ వద్ద గల వేదాంత కంపెనీలో పనిచేస్తున్న బిపిన్ జెన్న, బిపిన్ బిహారి సాహులు ఒక బైకుపై మునిగుడకు పనిమీద శనివారం సాయంత్రం బయలు దేరారు. ఈ క్రమంలో అంబొదల సమీపంలో కంటాబడి వద్ద గుర్తు తెలియని వాహనం వీరి బైకును ఢీకోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. సంఘటన స్థలంలోనే బిపిన్ జెన్న మృతి చెందగా సాహు తీవ్రగాయాలకు గురయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడుని అంబొదల ఆస్పత్రికి తరలించారు. అయితే అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కొసం బరంపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వన్డే మ్యాచ్ వీక్షించిన ముఖ్యమంత్రి



బారాబటి స్టేడియంలో భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య వన్డే మ్యాచ్



వన్డే మ్యాచ్‌ని ఆస్వాదించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: కటక్ బారాబటి స్టేడియంలో ఆదివారం జరిగిన భారత్, ఇంగ్లండ్ అంతర్జాతీయ వన్డే క్రికెట్ మ్యాచ్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి వీక్షించారు. ఈ మ్యాచ్ తొలి టికెట్ ముఖ్యమంత్రి కొనుగోలు చేసిన విషయం విదితమే. మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు స్టేడియంకు చేరుకున్న ముఖ్యమంత్రికి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఒడిశా క్రికెట్ అసోసియేషన్ (ఓసీఏ) కార్యదర్శి సంజయ్ బెహెరా ముఖ్యమంత్రికి జ్ఞాపికను అందజేశారు. వేలాది మంది క్రికెట్ ప్రేమికులు, అభిమానుల సమక్షంలో భారతదేశం, ఇంగ్లాండ్ మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌ను ఆస్వాదించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఇలాంటి అంతర్జాతీయ మ్యాచ్ జరగడం గర్వకారణంగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో ఉప ముఖ్యమంత్రులు కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా అనేక మంది మంత్రులు, ఇతర ప్రముఖులు చారిత్రాత్మక స్టేడియంలో వన్డే మ్యాచ్‌ను వీక్షించారు.

ట్రక్ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం



కొండబాబుకు అభినందిస్తున్న కార్యవర్గ సభ్యులు



కొత్తగా నిర్మించిన కార్యాలయ భవనం

రాయగడ: స్థానిక న్యూకాలనీ కపిలాస్ రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రక్ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయ భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. వేద పండితులు రేజేటి శ్రీనివాస్ శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అసోసియేషన్ అధ్యక్షులు యాల్ల కొండబాబు ప్రారంభించారు. గత 40 ఏళ్లుగా అసోసియేషన్‌కు సంబంధించిన ప్రత్యేక కార్యాలయం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఈ సందర్భంగా కొండ బాబు అన్నారు. అందరి సహకారంతో నేడు అన్ని సౌకర్యాలతో కూడిన భవనం ఏర్పాటు కావడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యాలయం భవనంలో సమావేశం హాల్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. లారీ యజమానుల సమస్యలకు సంబంధించి చర్చించుకునే అవకాశం ఉండేలా అన్ని వసతులు సమకూర్చినట్లు పేర్కొన్నారు. ఇదిలాఉండగా స్థానిక బారిజోల వద్ద అసోసియేషన్ తరపున రెండు ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే యజమానులు తమ లారీలను అక్కడే నిలుపుకునే సౌకర్యం సమకూరుతోందన్నారు. . ఈ సందర్భంగా అధ్యక్షుడికి అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, పట్టణ ప్రముఖులు పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

చిత్రకొండ సమస్యల పరిష్కారంపై దృష్టి



చిత్రకొండ ఆరోగ్య కేంద్రం వద్ద వైద్య సిబ్బందితో ఎమ్మెల్యే మంగు ఖిలో

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితిలో నెలకున్న సమస్యల పరిష్కారంపై దృష్టిసారించినట్లు ఎమ్మెల్యే మంగుఖిలో చెప్పారు. ఈ మేరకు ఆదివారం నాయకులు, అధికారులతో సమావేశమై చర్చించారు. జోడాంబు, పనాస్‌పూట్ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి సమస్యలను తీసుకొచ్చారు. విద్యుత్ సమస్యను పరిష్కరించాలని, చిత్రకొండ డిగ్రీ కళాశాలలో మౌలిక సదుపాయలు కల్పించాలని కోరారు. అనంతరం స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. మృతదేహాల తరలింపునకు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బంది కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

అరసవల్లిలో మాఘ మాస సందడి



ఆదిత్యుని ఆలయం ముందు భక్తుల రద్దీ

అరసవల్లి: మాఘ మాస ఆదివారం సందర్భంగా అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి సన్నిధి భక్తులతో కిటకిటలాడింది. సంప్రదాయం ప్రకారం ఇంద్రపుష్కరిణి ఒడ్డున సూర్యోదయ సమయం నుంచి వందలాది మంది మహిళలు తమ కుటుంబసభ్యులతో కలిసి పిడకల పొయ్యిపై క్షీరాన్నాన్ని వండి ఆదిత్యునికి ప్రసాదంగా నివేదించారు. అలాగే పలువురు భక్తులు చెరుకు, చలివిడి, పెసల మొలకలు, బెల్లం తదితర ప్రసాదాలను స్వామికి నివేదించారు. వత్సవలస రాజులమ్మ జాతర సందర్భంగా గ్రామీణ ప్రాంత భక్తులు భారీగా తరలిరావడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. వన్‌టౌన్ సీఐ పైడపునాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు. ప్రసాదాల విక్రయాలు, మరుగుదొడ్లు, నిత్యాన్నదాన ప్రసాదం, బట్టలు మార్చుకునే గదులు, మంచినీటి అవసరాలు, ప్రత్యేక దర్శన టిక్కెట్లు విక్రయాలు జరిగే ప్రదేశాల సమాచారం తెలిసేలా బోర్డులు లేకపోవడంతో భక్తులు చాలావరకు ఇబ్బందులు పడ్డారు. వివిధ దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.6,78,600, పూజలు, విరాళాల ద్వారా రూ.1,16,454, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.70 లక్షలు వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ వై.భద్రాజీ ప్రకటించారు. అలాగే విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి కూడా ఆదిత్యున్ని దర్శించుకున్నారు.

రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు నమోదుకు అవకాశం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): భూమి కలిగిన ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం జరుగుతుందని, దాని ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా రైతులకు సేవలందిస్తామని జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథ స్వామి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసిన తర్వాత భూమి గల ప్రతి రైతుకు కేటాయించే ప్రత్యేక గుర్తింపు సంఖ్య అని తెలిపారు. భూ ఆధారిత పథకాలైన పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మ పోషకాలు, సూక్ష్మసేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం వంటి పథకాలు నేరుగా పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో భూమి గల ప్రతి రైతుకు, ముున్ముందు కౌలు రైతులకు, భూమిలేని వ్యవసాయ కూలీలు, ఇతర వ్యవసాయ ఆధారిత వృత్తులలో ఉన్న వారికి ఇది వర్తిస్తుందని వివరించారు.

నమోదు విధానం ఇలా....

ఆధార్ నెంబర్ , ఆధార్ అనుసంధారిక ఫోన్ నెంబర్ , భూమి రికార్డుల వివరాలు (పట్టాదారు పాస్ బుక్) తీసుకుని గ్రామంలో రైతు సేవా సిబ్బందిని కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

క్లుప్తంగా

పోక్సో కేసు నమోదు

తెర్లాం: ఎనిమిదేళ్ల బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. దీనికి సంబంధించి తెర్లాం ఎస్సై సాగర్‌బాబు ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెర్లాం గ్రామంలోని బీసీ కాలనీ(టిన్నుల కోలనీ)కి చెందిన బాలిక శనివారం రాత్రి తినుబండారాలు కొనుగోలు చేసుకునేందుకు దుకాణానికి వెళ్లింది. దుకాణం నుంచి తిరిగి ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన కంకణాల కిరణ్ అనే వ్యక్తి ఆ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆ బాలిక ఏడ్చుకుంటూ వెళ్లి ఆ వ్యక్తి తనపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వెళ్లి కిరణ్‌ను గట్టిగా నిలదీయడంతోపాటు, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిజర్వ్ మద్యం షాపుల లాటరీ వాయిదా

పార్వతీపురంటౌన్: రిజర్వ్ మద్యం షాపుల లాటరీ వాయిదా వేసినట్లు ఇన్‌చార్జి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి. శ్రీనాథుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేడు జిల్లా పరిధిలో గల నాలుగు రిజర్వ్ షాపులకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్న లాటరీ విధానం ఎమ్మెల్సీ ఎన్నికల మోడల్ కోడ్ అమలులో ఉన్న కారణంగా వాయిదా వేసినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ అనుమతి వచ్చిన వెంటనే లాటరీ తేదీని ప్రకటిస్తామన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- సైబర్ మోసానికి గురై మనస్తాపం

పార్వతీపురం రూరల్: సైబర్ మోసానికి గురైన ఓ యువకుడు మనస్తాపంచెంది పురుగు మందు తాగి శనివారం రాత్రి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి పార్వతీపురం ఔట్ పోస్టు పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోరి గంగాపురం గ్రామానికి చెందిన రాయల శంకరరావు ఎవరివద్ద అయినా రూపాయి నోటు ఉంటే ఆనోటుకు రూ. 12 లక్షలు వస్తాయన్న ప్రకటన యూట్యూబ్‌లో చూసి ఆశపడి రూ. 2లక్షల వరకు చెల్లించాడు. ఇంకా డబ్బులు చెల్లించాలి. లేదంటే మీఖాతా బ్లాక్ అయిపోతుందని తెలియజేయడంతో మళ్లీ శనివారం సాయంత్రం మరో రూ.70 వేలు చెల్లించాడు. మీరు సరైన సమయానికి డబ్బులు చెల్లించలేదు. కాబట్టి మీకు డబ్బులు రావని చెప్పడంతో మనస్తాపంచెంది గడ్డి మందు తాగేశాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి 108 వాహనంద్వారా తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసినట్లు రూరల్ ఏఎస్సై ఎస్.భాస్కరరావు తెలిపారు.

చెరకులారీ బోల్తా



బోల్తాపడిన లారీ

రాజాం సిటీ: మండల పరిధిలోని గురవాం-బూరాడ గ్రామాల సమీపంలో చెరుకు లారీ బోల్తాపడింది. పరిమితికి మించి లోడుతో సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడింది.ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డుపై లారీ పడడంతో ఇటు గురవాం అటు బూరాడ వరకు ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. అధికలోడుతో వెళ్తున్న వాహనాలపై పోలీసులు దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహన రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య?

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న రజని

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట గ్రామానికి చెందిన జన్ని రజని(32) అనే వివాహిత ఆదివారం ఉదయం భద్రగిరి ఏపీ టీడబ్ల్యూఆర్ గరల్స్ స్కూల్(పీటీజీ)ను ఆనుకుని ఉన్న సొంత జీడితోటలో ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు సంఘటన స్థలం వద్ద గడ్డిమందు కూడా లభ్యమైంది. అయితే ఇది హత్యా? ఆత్మహత్యా అన్న విషయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రజని తండ్రి దండాసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎల్విన్‌పేట ఎస్సై బి.శివప్రసాద్ తెలిపారు. ఇదిలా ఉండగా రజని భర్త ఉదయ్‌కుమార్ కలెక్టరేట్‌లో రెవెన్యూ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. వారికి ఆరేళ్ల కుమారుడు ఉన్నాడు.

- గ్యాస్ సబ్సిడీ కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు
- 60 శాతం మందికి పడని సబ్సిడీ
- ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం
- తీరా ఇచ్చింది ఒక్కటే
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

అంతా.. ఉత్త గ్యాసే!





వీరఘట్టం/సీతంపేట: ఈఫొటోలో ఉన్న సీతంపేట మండలం రాజన్నగూడకు చెందిన మహిళ పేరు సవర సరోజిని. ఈమె 30-12-2024న హెచ్‌పీ గ్యాస్‌ను రూ.860లు చెల్లించి విడిపించింది.గ్యాస్ సబ్సిడీ వస్తుందని నలభై రోజులుగా ఎదురుచూస్తోంది. ఇంతవరకు చిల్లిగవ్వ కూడా గ్యాస్ సబ్సిడీ పడలేదు. ఈమె ఒక్కరే కాదు జిల్లాలోని సుమారు వేల సంఖ్యలో గ్యాస్ లబ్ధిదారులకు రోజులు, నెలలు గడుస్తున్నా సబ్సిడీ డబ్బులు పడకపోవడంతో కూటమి ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు.

ఏడు నెలల కూటమి పాలనలో అంతా గ్యాస్ కొట్టే మాటలే తప్ప చేసి చూపించిన దాఖలాలు లేవని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. పాలన అంతా సిలిండర్ ఉండే తప్ప .. అందులో గ్యాస్ లేదని ఎద్దేవా చేస్తున్నారు.ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం తీరా చూసేసరికి ఈ ఏడాది మార్చి వరకు ఒకటే ఇచ్చిందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి.అయితే ఏ కొందరికో డబ్బులు వేసి మేం అందరికీ ఇస్తున్నాం అని గొప్పలు చెప్పుకుంటోంది.గతేడాది 2024 జూన్‌లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ ఏడాది మార్చి వరకు ఒక సిలిండర్ మాత్రమే ఇచ్చి మూడు సిలిండర్‌లు ఇచ్చామన్నట్లుగా కలరింగ్ ఇస్తోంది. ఇదంతా తెలిసిన లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రంలో మహిళలకు ఉచితంగా చేసే వంట గ్యాస్ పథకంలో ఆదిలోనే హంసపాదుగా మారింది.మహిళలకు కానుకగా గతేడాది దీపావళి పండగ నుంచి ఉచిత గ్యాస్ ఇస్తున్నట్లు ప్రకటించారు.అయితే దీపావళి పోయే..సంక్రాంతి పోయే వరకు గ్యాస్ సబ్సిడీ నగదు పడిన దాఖలాలు లేవు. నిజానికి ఇప్పటికే రెండు సిలిండర్లు ఇవ్వాలి. కానీ 2024 నవంబర్ నెలాఖరు వరకూ మొదటి సిలిండరు డబ్బులు కూడా జమ కాలేదు.గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి నెలకొంది.

48 గంటల హామీ అమలు ఏమైంది..

వంటగ్యాస్ వినియోగదారులకు గ్యాస్ అందించిన 48 గంటల్లో సబ్సిడీ డబ్బు బ్యాంకు ఖాతాల్లో వేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది.అయితే ఇంతకీ గ్యాస్ తెచ్చుకున్న 60 శాతం మందికి నగదు పడలేదని, సబ్సిడీ డబ్బుల కోసం బ్యాంకుల చుట్టూ పాస్‌బుక్ చేతబట్టుకుని తిరగాల్సి వస్తోందని మహిళలు మండిపడుతున్నారు.దీనికి నిధులు ఎప్పుడు మంజూరు చేస్తారో ఏమీ తెలియని దుస్థితి. పాలకులు మాత్రం అందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారు.గ్యాస్ డెలివరీ చేసి 48 గంటల్లోపు సబ్సిడీ డబ్బులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. కానీ నవంబర్ లోపు గ్యాస్ బుక్ చేసుకున్న వారికి మూడు నెలలు గడుస్తున్నా వేలాది మంది లబ్ధిదారులకు డబ్బు జమ కాలేదు.

ఇంకా డబ్బు పడలేదు



నేను 1.11.2024న హెచ్‌పీ గ్యాస్ బుక్ చేశాను. 4.11.2024న గ్యాస్ వచ్చింది.రూ.860లను గ్యాస్ కంపెనీ కుర్రోళ్లకు చెల్లించి సిలిండర్ తీసుకున్నాను.మరుసటి రోజు గ్యాస్ కంపెనీ డబ్బులు పడతాయని ,బ్యాంకులో తీసుకోండని చెప్పారు. 6.11.2024న రూ.10.62 పైసలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న రూ.816.89 పైసలు సబ్సిడీ వస్తుందన్నారు. కానీ ఇంతవరకు ఆ డబ్బులు పడలేదు.ఎవరిని అడగాలో తెలియక బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాను.ఎవరిని అడిగినా నాలుగు రోజులు ఆగండి అని చెబుతున్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలి.

ఎస్.తిరుమల రావు

జిల్లాలో 1.60 లక్షల గ్యాస్ కనెక్షన్లు

పార్వతీపరం మన్యం జిల్లా వ్యాప్తంగా భారత్, హెచ్‌పీ, ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. ఈ గ్యాస్ ఏజెన్సీల పరిధిలో సుమారు 1.60 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి.అందులో ఉజ్వల, పీఏయూవై, దీపం, జనరల్ కనెక్షన్లు ఉన్నాయి. ఏజెన్సీ నిర్వాహకులు తమ పరిధిలోని గ్యాస్ వినియోగదారులకు నిరంతరం ఇళ్లకు గ్యాస్ సరఫరా చేస్తున్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించింది. ఇలా ప్రకటించిన వారం రోజులకు కొంతమంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో అక్కడక్కడా సబ్సిడీ జమ చేశారు. మిగిలిన వారికి ఇంతవరకూ డబ్బులు ఖాతాల్లో వేయడం లేదు.

సబ్సిడీ కోసం ఎవరిని అడగాలో?

ఉచిత గ్యాస్ పథకానికి సంబంధించిన సమస్యలు ఉంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. సబ్సిడీ డబ్బులు ఎందుకు పడలేదని ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నిస్తే పౌరసరఫరాల కార్యాలయంలో అడగమని అంటున్నారు. అక్కడికి వెళ్తే బ్యాంకు ఈకేవైసీ చేయించాలంటున్నారని, ఈకేవైసీ చేయించామని చెప్తే, గ్యాస్ ఆఫీసుకు వెళ్లి చెప్పమని అంటున్నారు.దీంతో ఉచిత గ్యాస్ పథకం కూటమి ప్రభుత్వ మాయగా మారిపోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడడంతో ఇలా ప్రజలను ఇబ్బందులు పెడుతోందని మహిళా సంఘాలు విమర్శిస్తున్నాయి.

అందుబాటులో టేనెక్టివ్ ప్లస్ ఇంజక్షన్



డాక్టర్ బి.వాగ్దేవి, డీసీహెచ్ఎస్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

పార్వతీపురంటౌన్: జిల్లాలోని 7 ఆసుపత్రుల్లో అందుబాటులో టేనెక్టివ్ ప్లస్ ఇంజక్షన్‌లు అందుబాటులో ఉన్నాయని డీసీహెచ్‌స్ డాక్టర్ బి. వాగ్దేవి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుండెపోటుకు ఎమర్జెన్సీగా ఇచ్చే ఇంజక్షన్‌లు పార్వతీపురం జిల్లా ఆస్పత్రి, సాలూరు, పాలకొండ, సీతంపేట ఏరియా ఆస్పత్రులు, కురుపాం, చినమేరంగి, భద్రగిరి సీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వాటిని ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. గుండెపోటుకు ఇచ్చే టేనెక్టివ్ ప్లస్ ఇంజక్షన్ సుమారు రూ: 45,000ల ఖరీదైనది జిల్లాలోని 7 ఆస్పత్రుల్లో ఉచితంగా లభిస్తుందన్నారు. ఛాతీ నొప్పి, ఆయాసం తదితర గుండెపోటు లక్షణాలు గల రోగులు నేరుగా గానీ 108లో గాని, ఏదైనా వాహనంలో గానీ త్వరగా ఈ ఆస్పత్రులకు చేరుకోవాలని సూచించారు. ఈసీజీ తీసి ఆన్‌లైన్‌లో కార్డియాలజిస్టును సంప్రదించి గుండెపోటును నిర్ధారించిన వెంటనే టేనెక్టివ్ ప్లేస్ ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలు కాపాడే చర్యలను తీసుకుంటున్నట్లు తెలిపారు.

సత్తా చాటిన దివ్యాంగుల క్రికెట్ జట్టు

- గుంటూరు విజ్ఞాన యూనివర్సిటీలో పోటీల నిర్వహణ



రాష్ట్రస్థాయి ట్రోఫీతో జిల్లా దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులు

భామిని: పార్వతీపురం మన్యం జిల్లా దివ్యాంగ క్రికెట్ జట్టు రాష్ట్ర క్రికెట్ పోటీలలో సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచింది. గుంటూరులోని విజ్ఞాన యూనివర్సిటీ ఉత్సవాల్లో భాగంగా ఈనెల-7,8 తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా దివ్యాంగ జట్టు కెప్టెన్ కేవటి శ్రీను ఆధ్వర్యంలో టీమ్ ప్రథమ స్థానంలో నిలిచి ట్రోఫీ, నగదు బహుమతి అందుకుంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న 2024 పారా ఒలెంపిక్ బ్రౌంగ్ మెడలిస్ట్, ఇండియన్ పారామిలటరీ పిస్టల్ షూటర్ రుబీనా ఫ్రాన్సిస్ చేతుల మీదుగా ట్రోఫీని అందజేశారు. ఈ జట్టులో అత్యధికంగా భామిని మండలానికి చెందిన వారే ఉన్నారు. కెప్టెన్ కేవటి శ్రీను(నేరడి-బి), వలరౌతు డిల్లీశ్వరరావు(కీసర), గౌడో సంతోష్(కాట్రగడ-బి), రాయవలస వినోద్ (గురండి), బాణాల నరేష్(పాలకొండ)తో పాటు 11 మంది జిల్లా క్రీడాకారులున్నారు.

తోటపల్లికి పూర్వవైభవం

- ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు దంపతులు

గరుగుబిల్లి: చినతిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి పూర్వవైభవం తీసుకురావడానికి కృషిచేస్తున్న అభివృద్ధి కమిటీ సేవలు అమూల్యమని ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ.శంకరరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని కుటుంబసమేతంగా సందర్శించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్రను, ప్రస్తుతం నిర్వహించిన నిర్మాణాలను, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపై టీటీడీ ఎగ్జిక్యూటివ్ డా.డి.పారినాయుడు ఆయనకు వివరించారు. అనంతరం ఎస్టీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ భక్తుల విరాళాలతో టీటీడీ సేవా ట్రస్టు ఆలయ నిర్మాణానికి ముందుకువచ్చి అద్భుతంగా నిర్మించడం అభినందనీయమన్నారు. దేవాలయ ప్రాంగణంలో జ్ఞానజ్యోతి ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని ఏర్పాటుచేయడం ఎంతో మంచి నిర్ణయమన్నారు. ఆలయ నిర్మాణం, విగ్రహప్రతిష్ట, స్వామి వారి వార్షిక కల్యాణం నిర్వహించడంతో ఈప్రాంతానికి కొత్త రూపం సంతరించుకున్నట్లు ఉందన్నారు. ఆలయ చరిత్ర పుస్తకాన్ని, క్యాలెండర్‌ను డీవీజీ దంపతులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు టి.దుర్గారావు, ఎం.ప్రకాశ్ రావు, రథో మాస్టారు, కొండలరావు, హరిప్రసాద్, బి.శ్రీహరి, ఎ.వైకుంఠరావు పాల్గొన్నారు.

రోడ్డు టెర్రర్: ఒకే రోజు రెండు రోడ్డు ప్రమాదాలు

- ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు



చందకపేట వద్ద జరిగిన ప్రమాదంలో108 వాహనంలో బాధితులను తరలిస్తున్న సిబ్బంది



బొండపల్లి వద్ద ఆటో, ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కాశీపట్నానికి చెందిన వ్యక్తి

బొండపల్లి: జాతీయ రహదారి26 ప్రమాదాలకు నిలయంగా మారింది. పోలీసులు సంబధిత శాఖలకు చెందిన అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ప్రమాదాలు మాత్రం తగ్గడం లేదు. బోడసింగి పేట గ్రామం జంక్షన్ నుంచి గొట్లాం గ్రామం వరకు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా జాతీయ రహదారి మారింది.నెలలో కనీసం ఇద్దరి నుంచి ఐదుగురి వరకు మృత్యువాత పడడం ఇక్కడ పరిపాటిగా మారింది. అందుకు నిదర్శనంగా ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాలు జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాలకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. మండలంలోని జాతీయ రహదారి 26పై చందక పేట జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బొండపల్లి గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌తో పాటు, యందవ ప్రణీత్‌లు బోల్తాపడి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఇద్దరినీ 108 వాహనంలో విజయనగరంలోని మహారాజా కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించారు. అలాగే మండల కేంద్రానికి సమీపంలో గల పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుకనుంచి వేగంగా వస్తున్న ఆటో ఢీకొనడంతో ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కాశీపట్నానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ప్రైవేట్ అంబులెన్స్‌లో జిల్లాకేంద్రంలోని మహారాజా కేంద్ర సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపిస్తున్నారు.

కొఠియా గ్రామాల్లో ఒడిశా పోలీసుల కవ్వింపు



కొఠియా పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఆంధ్రా అభివృద్ధి పనుల కోసం తీసుకువచ్చిన సామగ్రి, వ్యాన్

సాలూరు: వివాదాస్పద ఆంధ్రా, ఒడిశా సరిహద్దు కొటియా గ్రూప్ గ్రామాల్లో ఒడిశా ప్రభుత్వం, పోలీసుల కవ్వింపు చర్యలు కొనసాగుతున్నాయి.ఇటీవల గంజాయిభద్ర పంచాయతీ దిగువశెంబిలో అంగన్వాడీ కేంద్రానికి వచ్చి అక్కడ తెలుగులో ఉన్న బోర్డులను ఒడిశా పోలీసులు, అధికారులు తీసుకువెళ్లిన విషయం పాఠకులకు విదితమే. తాజాగా శనివారం ధూళిభద్ర వద్ద జలజీవన్ మిషన్ కింద వాటర్‌ట్యాంకు పైపుల నిర్మాణానికి తీసుకువచ్చిన వ్యాన్, సిమెంట్ సామగ్రిని వ్యాన్‌తో సహా కొఠియా పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లిపోయారు. తరువాత శనివారం రాత్రి వ్యాన్, అదుపులోకి తీసుకున్న డ్రైవర్‌ను విడిచిపెట్టి వెళ్లిపోమని కొఠియా పోలిసులు తెలిపినట్లు సమాచారం . కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆంధ్రా ఒడిశా కొఠియా గ్రూప్ గ్రామాల్లో ఒడిశా పోలీసులు, అధికారులు ఇలా కవ్వింపు చర్యలు చేపడుతున్నా ఆంధ్రా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారంటూ పలువురు గిరిజనుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

15 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

కొత్తవలస: మండలంలోని సంతపాలెం గ్రామం సమీపంలో అక్రమంగా 15 మద్యం సీసాలను తరలిస్తున్న ఎస్.వాసు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని మద్యం సీసాలను సీజ్ చేసినట్లు సీఐ రాజశేఖరనాయుడు ఆదివారం తెలిపారు. కొత్తవలస- సబ్బవరం రోడ్డులో ఎక్సైజ్ నేరాలపై విచారణ చేస్తుండగా నిందితుడు మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్సై వీఎస్.రాజు, సిబ్బంది బి.రాముడు, ప్రసాద్, బి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే సోమవారం విజయనగరంలో జరగబోయే కల్లుగీత కులాలకు చెందిన మద్యం షాపులకు సంబంధించి లాటరీని ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా పడినట్లు సీఐ రాజశేఖరనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

రైలు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయాలతో పడిఉన్న రాము

బొబ్బిలి: పట్టణ రైల్వేస్టేషన్‌కు వ్యక్తి గత పనుల మీద వచ్చిన వ్యక్తిని రైలు ఢీకొనడంతో గాయాలతో బయటపడ్డాడు. ఆదివారం జరిగిన ఈ సంఘటనపై జీఆర్‌పీ హెచ్‌సీ బండారు ఈశ్వరరావు తెలిపిన వివరాల మేరకు మండలంలోని పక్కి గ్రామానికి చెందిన బంకురు రాము బొబ్బిలి స్వంత పనులపై రైల్వేస్టేషన్ గుండా వెళ్తుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో పక్కకు తుళ్లిపోయాడు. దీంతో జీఆర్‌పీ హెచ్‌సీ 108కు సమాచారమివ్వగా సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆ వ్యక్తిని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించినట్లు హెచ్‌సీ ఈశ్వర రావు తెలిపారు.

నందివానివలసలో గజరాజులు

గరుగుబిల్లి: మండలంలోని నందివానివలసలో గజరాజుల గుంపు ఆదివారం ఉదయం దర్శనమిచ్చింది. కొన్నేళ్లుగా కురుపాం నియోజకవర్గంలోని గరుగుబిల్లి, కొమరాడ, జియ్యమ్మవలస, కురుపాం మండలాలలోనే ఏనుగులు సంచరిస్తున్నాయి. కొమరాడ మండలం కళ్లికోట, విక్రంపురం, మార్కొండపుట్టి తదితర గ్రామాల మీదుగా నందివానివలస చేరుకొని తామర చెరువుకు చేరాయి. ప్రస్తుతం ఆయా గ్రామాలలో అరటి పంటలున్నాయి. పంటలను నాశనం చేయడంతో పాటు ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోనని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. అధికారులు స్పందించి ఏనుగుల గుంపును ఈ ప్రాంతం నుంచి తరలించి ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ ఎంపీ సీ, బైపీసీ రెండో సంవత్సర ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా 93 పరీక్ష కేంద్రాల్లో జరుగుతాయని ఆర్ఐఓ మజ్జి ఆది నారాయణ తెలిపారు. పరీక్షలకు హాల్‌టికెట్లను ఇంటర్ విద్యా మండలి ఇప్పటికే విడుదల చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఒకేషనల్ ప్రాక్టికల్స్ జరుగుతుండగా ఈ పరీక్షలు కూడా ఈ నెల 20వ తేదీ వరకు జరగనున్నాయని తెలిపారు. ఎంపీసీ విద్యార్థులు 14,470 మంది, బైపీసీ విద్యార్థులు 4,053 మంది పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. హాల్‌టికెట్లను వారి కళాశాలల లాగిన్‌లోను, 'బీఐఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ప్రకటించారు.

నేడు ప్రధాన మంత్రి మోదీతో ముఖాముఖి

- పరీక్షా పే చర్చ లైవ్ ప్రోగ్రాంకు ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు

వీరఘట్టం: ఇది పరీక్షల కాలం. పరీక్షలపై విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి వారిలో మానసిక స్థైర్యాన్ని నింపేందుకు ప్రతి ఏటా 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేరుగా వారితో మాట్లాడుతున్నారు. ఈ ఏడాది కూడా విద్యార్థులతో పరీక్షా పే చర్చ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 11 గంటలకు పీఎం మోదీ మాట్లాడనున్నారు. ఇందుకు సంబంధించి పీఎం మోదీ విద్యార్థులతో మాట్లాడేందుకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల విద్యాశాఖ అధికారులు అన్ని పాఠశాలల్లో స్క్రీన్స్ ఏర్పాటు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు ద్వారా అన్ని పాఠశాలల్లో డిజిటల్ తరగతులు ఏర్పాటు చేశారు. ఇప్పుడా డిజిటల్ స్క్రీన్స్ పీఎం మోదీతో మాట్లాడేందుకు ఎంతగానో ఉపయోగపడనున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. అయితే సోమవారం నుంచి టెన్త్ విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు ఉన్నందున వారికి పరీక్షల అనంతరం పీఎం మోదీ ప్రసంగాన్ని యూట్యూబ్ చానల్స్‌లో చూపించనున్నారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 11 గంటల నుంచి లైవ్ ప్రోగ్రాం చూపించేందుకు ఏర్పాట్లు చేశారు.

ముమ్మర ఏర్పాట్లు

పరీక్షా పే చర్చ కార్యక్రమంలో నేరుగా ప్రధాన మంత్రితో మాట్లాడేందుకు పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలో 1,46,788 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కొద్ది రోజుల క్రితం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారిలో పార్వతీపురం మన్యం జిల్లాలో 44,379 మంది విద్యార్థులు, 2,955 మంది ఉపాధ్యాయులు, 1,204 మంది తల్లిదండ్రులు ఉన్నారు.అలాగే విజయనగరం జిల్లాలో 89,302 మంది విద్యార్థులు, 6,429 మంది ఉపాధ్యాయులు, 2,519 మంది తల్లిదండ్రులు ఉన్నా రు. అయితే వారిలో పీఎం మోదీ ఎవరితో డైరెక్ట్‌గా మాట్లాడతారోనని అందరూ ఆశగా ఎదురుచూస్తున్నారు.



వీరఘట్టంలో సిద్ధం చేసిన డిజిటల్ స్క్రీన్

ఏర్పాట్లు పూర్తి



జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాల్లో డిజిటల్ స్క్రీన్స్ సిద్ధం చేశాం. పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా పీఎం మోదీ ప్రోగ్రాం 6-10 తరగతుల విద్యార్థులు చూసేందుకు ఏర్పాట్లు చేశాం. ఈ ప్రోగ్రాంలో ఎటువంటి అంతరాయం లేకుండా ఉపాధ్యాయులు పక్కాగా చర్యలు చేపట్టాలి.

ఎస్.తిరుపతినాయుడు, డీఈఓ, పార్వతీపురం మన్యం



పరీక్షా పే చర్చ వాల్‌పోస్టర్